హైదరాబాద్ వార్త



# ఏఐ ఫోటోలతో వేధిస్తోంది

**- బంజారాహిల్స్ ఠాణాలో ముంబై నటుడు ఫిర్యాదు**

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** ఏఐ ద్వారా సృష్టించిన ఫొటోలతో ఒక మహిళ తనను తీవ్ర వేధింపులకు గురిచేస్తుందని ముంబైకి చెందిన ఒక నటుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ముంబైకి చెందిన ఫ్రీలాన్స్ నటుడు ఆనంద్ సురేష్ కుమార్ రెన్వా అలియాస్ రిషబ్ రెన్వా (36)ను గత మూడేళ్లుగా జియా ఉన్నిసా నస్రీన్ తీవ్రంగా వేధిస్తోంది. ఇన్‌స్టా, వాట్సాప్ ఇతర సామాజిక మాధ్యమాలలో ఆమె అతని అర్ధనగ్న, నగ్న ఫొటోలను ఏఐ ద్వారా సృష్టించి చిత్ర పరిశ్రమలోని పలు ప్రొడక్షన్ కంపెనీలకు పంపించింది. ఆమెకున్న దాదాపు 15 నుంచి 20 నకిలీ ఇన్‌స్టా ఖాతాల ద్వారా అతని ప్రతిష్టను దిగజార్చేలా సందేశాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. అతని స్నేహితులతోపాటు కుటుంబ సభ్యులను సైతం లక్ష్యంగా చేసుకొని ఆమె వేధింపులకు పాల్పడుతుంది. లాతూర్‌లో నివసించే తన సోదరి ఫొటోలను తీసి, తన బావను చంపడానికి ఇద్దరు షూటర్లను పంపింది. జియా ఉన్నిసాతో తనకు ప్రాణహాని ఉందని, అంతేకాకుండా తన స్నేహితులందరికి నగ్న ఫొటోలను, సందేశాలను పంపిస్తూ తనను తీవ్ర ఇబ్బందులకు, వేధింపులకు గురిచేస్తుందంటూ ఆనంద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రంగనాథస్వామి మాన్యం భూముల్లో నిర్మించిన రహదారి

# బరితెగింపు

**గచ్చిబౌలి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** హైటెక్ మండలం శేరిలింగంపల్లిలో బహుళ అంతస్థుల నిర్మాణ సంస్థల యజమానులు బరితెగించారు. రంగనాథస్వామి దేవాలయం మాన్యం భూములను ఆక్రమించి రాత్రికి రాత్రే భారీ రహదారి నిర్మించారు. తెల్లవారే సరికి సిసి రోడ్డు దర్శనం ఇవ్వడంతో విస్తుపోయిన స్థానికులు దేవాదాయ శాఖ అధికారులకు పిర్యాదు చేయగా, స్పందించిన అధికారులు వేసిన రోడ్డును తొలగించడంతో పాటు నిర్మాణ సంస్థల మీద పోలీసులకు పిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో పురాతన రంగనాథ స్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయం మాన్యం కింద గోపన్‌పల్లి వ్యాప్తంగా భూములు ఉన్నాయి. గోపన్‌పల్లి గ్రామ సర్వే నెంబరు 268లో సైతం 13 ఎకరాల దేవుని మాన్యం భూమి ఉంది. కాగా ఈ భూమికి ఆనుకొని తెల్లాపూర్ గ్రామంలో వెలిసిన పలు బహుళ అంతస్థుల నిర్మాణాలు రహదారి కోసం రంగనాథ స్వామి దేవుని మాన్యం భూముల మీద కన్నేశాయి. ఇందులో భాగంగా శనివారం అర్ధరాత్రి దేవుని మాన్యం భూమిని చదును చేసి రాత్రికి రాత్రే సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఉదయం విషయం గమనించిన స్థానికులు దేవాదాయ శాఖ అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలికి చేరుకున్న ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌రెడ్డి, ఈఓ సత్యచంద్రారెడ్డిలు రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు.

- రంగనాథస్వామి దేవాలయ భూములపై అక్రమార్కుల కన్ను
- రాత్రికి రాత్రే రహదారి నిర్మాణం
- స్థానికుల ఫిర్యాదుతో పోలీసుల జోక్యం
- జెసిబితో రోడ్డు తొలగింపు
- చట్ట ప్రకారం చర్యలకు దేవాదాయశాఖ సమాయత్తం

దీంతో పాటు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు.
వేసిన సిసి రోడ్డును జెసిబితో పెకిలించి తొలగించడంతో పాటు ఈ దారిలో రాకపోకలు సాగకుండా కందకం ఏర్పాటు చేశారు. దేవుని మాన్యం భూములను ఆక్రమించి రహదారి నిర్మాణానికి ప్రయత్నించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

# వైరల్..వైరల్

**నగరంలో ఎక్కడ చూసినా జ్వరాలే**
**ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిట**
**చాపకింద నీరులా పాకుతున్న వైరల్ జ్వరాలు**
**అధికమవుతున్న టైఫాయిడ్, డెంగీ, మలేరియా**
**పారిశుధ్య లోపం..దోమల స్వైర విహారం**
**జ్వరాలతో విలవిల.. ఓపీలు కిటకిట**



రోగులతో కిటకిటలాడుతున్న నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి

**హైదరాబాద్, సెప్టెంబరు14, ప్రభాతవార్త :** వైరల్ ఫీవర్..వైరల్ ఫీవర్..ఎవరిని పలకరించినా ఇదే మాట చెబుతున్నారు. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, తల నొప్పితో పాటు జలుబు వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఆస్పత్రి చూసినా జ్వరాల బారిన పడిన రోగులతో కిటకిటలాడుతోంది. వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యా, డెండీ వంటి జ్వరాలు కూడా ప్రబలుతున్నాయి. ఫీవర్ సర్వే చేస్తున్నామంటూ అధికారులు ఊదరగొడుతున్నా..క్షేత్రస్థాయిలో ఇలాంటి సర్వే చేస్తున్న జాడే కనిపించట్లేదు. నామమాత్రంగా అక్కడో క్యాంప్. ఇక్కడో క్యాంపు పెట్టి మమ అనిపించేస్తున్నారు. ఇక, వైద్యాధికారులను గట్టిగా అడిగితే మాత్రం..ఈ సీజన్‌లో జ్వరాలు కామన్..అంటూ సమాధానం దాటేస్తున్నారు. గత రెండు నెలలుగా నగరంలో పరిస్థితి ఇలాగే ఉన్నా అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి చర్యలు కనపించట్లేదు.

**దోమల బెడద పట్టదా..?**

నగరవ్యాప్తంగా దోమల బెడద తీవ్రమైంది. బస్తీలు, కాలనీల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకున్న నాథుడే కనిపించట్లేదు. దోమల వ్యాప్తి ద్వారా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి జ్వరాలు వస్తున్నాయి. ఎప్పుడో ఒకసారి ఇలా వచ్చి దోమల పొగ స్ప్రేచేసి వెళ్తున్నా..దోమలను పూర్తి స్థాయిలో నివారించే చర్యలేవి కనిపించట్లేదు. దీంతో అనేక మంది జ్వరాల బారినపడుతున్నారు.

**ఫీవర్‌కు పెరిగిన తాకిడి..**

అపరిశుభ్ర వాతావరణం, కురుస్తున్న వర్షాల ప్రభావంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, డెంగీ, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. రక్త పరీక్షల్లో మాత్రం అధికంగా వైరల్ ఫీవర్ కేసులే తేలుతున్నాయి. ఓపీతో పాటు ఇన్‌పేషంట్లుగా చేరే వారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. ఇక. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి జ్వరాల బాధితులతో కిక్కిరిస్తోంది. అస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి రోజు 800కు పైగా ఓపీ నమోదవుతోంది. రోజుకు 20 నుంచి 45 మంది వరకు ఇన్‌ఫేషంట్లుగా చేరుతున్నారు. దీంంతో మెడికల్ వార్డులు రోగులతో నిండిపోతున్నాయి. గతంలో 400 నుంచి 600 వరకు ఉన్న ఔట్‌పేషెంట్లు ఇప్పుడు 900కు చేరింది. అలాగే ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లోని యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో వైద్యం కోసం ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులకు వెళ్లి అడ్మిషన్ పొందుతున్న వారు కూడా ఎక్కువే ఉన్నారు.

**పిల్లలపై ప్రభావం అధికమే..**

వర్షాలు, వరదలు, కలుషిత వాతావరణ ప్రభావంతో వస్తున్న విష జ్వరాల బాధితుల్లో చిన్నారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుల్లో సుమారు 40 శాతం మంది పదేళ్లలోపు చిన్నారులే ఉన్నారని చెబుతున్నారు. ఉన్నట్టుండి శరీరం వేడెక్కడం, నీరసం, చలి, గొంతునొప్పి వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో సాధారణంగా ఓపీలో 800-9200 మంది వస్తుంటారు. కానీ, ఇప్పుడు రోజుకు 1,000 **-1,200 మంది వస్తున్నారు**

అవసరమైన వైద్య సిబ్బంది ఉన్నారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు ఈ సీజన్‌లో అధికంగా దాడి చేస్తున్నాయి. నీరు, ఆహారం కలుషితమవడం, వరదల వల్ల ఈగల వ్యాప్తి పెరిగి టైఫాయిడ్, డయేరియా ప్రబలుతున్నాయి. హెపటైటిస్-ఏ,ఈ కూడా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ప్రాథమిక దశలో జ్వరానికి పారాసిటమాల్ మాత్ర వేసుకోవాలి. తీవ్రమైన నడుంనొప్పి, బీపీ పడిపోవడం, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలుంటే వెంటనే అర్హులైన వైద్యులను సంప్రదించి రోగ నిర్ధారణ చేసుకోవాలి. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సొంత వైద్యం మాత్రం వద్దు. ఆస్పత్రిలో ప్రస్తుతం వైరల్ ఫీవర్‌తోపాటు డెంగీ సుమారు ఎనిమిది కేసులు నమోదయ్యాయి. వారికి ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నాం. కుక్కకాటు బాధితులు కూడా రోజు పదుల సంఖ్యలో వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

**-డాక్టర్ రాజేంద్రప్రసాద్**
**సూపరింటెండెంట్, ఫీవర్ ఆస్పత్రి**

## భక్తి శ్రద్ధలతో మిలాదున్ నబీ





మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించిన మిలాద్ ర్యాలీ కన్నుల పండుగగా సాగింది. దక్షిణ మండలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఊరేగింపులో ఒంటెలు, గుర్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



బిసి కల్చరల్ ఫోరం రాష్ట్ర సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

# పల్లెపల్లెకు బిసి భావజాల ఉద్యమం

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పాటనే ఆయుధంగా చేసుకుని బీసీ కవులు, రచయితలు, కళాకారులు బీసీ భావజాల ఉద్యమాన్ని పల్లె పల్లెకు విస్తరింపచేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బీసీ కళాకారులకు పిలుపునిచ్చారు. ఆదివారం బీసీ కల్చరల్ ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వరంగల్ శ్రీనివాస్ అధ్యక్షతన, దరువు అంజన్న, కోదారి శ్రీనివాస్‌ల సమన్వయంతో జరిగింది. ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరై జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలకు వారసత్వంగా గొప్ప చరిత్ర ఉందని, బీసీ కులాలలో రాజులు, చక్రవర్తులు, మహనీయులు జన్మించారని, బీసీ కులాలలో తరతరాలుగా ఎంతో ప్రతిభ, పాటవాలు కలిగిన చరిత్ర ఉందన్నారు. ఇంత ఘనమైన చరిత్ర ఉన్న బీసీలు నేడు బలహీనంగా అరశాతం, ఐదు శాతం లేని వాళ్ల దగ్గర సాగిల పడి అడుక్కోవటంలో అర్థం లేదన్నారు. బీసీ కళాకారులు, కవులు తమ కళాలను గలాలను బీసీల వారసత్వాన్ని,సాంస్కృతిక చైతన్య వైభవాన్ని భవిష్యత్ తరాలకు చాటి చెప్పి పాలితులుగా ఉన్న బీసీలను పాలకులుగా చేయటానికి బీసీ సాంస్కృతిక సైన్యం నిర్విరామంగా కృషి చేయాలని కోరారు. బీసీ ఉద్యమాన్ని రాయితీల నుండి రాజ్యాధికారం కోసం, స్వయం పాలన, స్వయం నిర్ణయ అధికారం వచ్చేవరకు చేసే ఉద్యమంలో కవులు కళాకారులు తమ వంతు పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఫోరం అధ్యక్ష కార్యదర్శులు వరంగల్ శ్రీనివాస్, దరువు అంజన్నలు మిగతా 3లో

# సమస్య రాసివ్వండి.. వారంలో పరిష్కరిస్తాం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** సమస్య ఏది ఉన్నా లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వండి.. మేము వారం రోజుల్లో ఆ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని జయప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ఏర్పాటుచేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. జూబ్లీహిల్స్ ఉపెన్నికల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని నగర ఇమేజ్‌ను పెంచే కార్యక్రమంలో ఈ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. గత పదేళ్లుగా నగరం చాలా పెరిగిందని, అవసరానికి తగిన విధంగా నీటిని తీసుకురావడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గోదావరి ఫేజ్-2కు 300 ఎంఎల్‌డి నీటిని తీసుకురావడానికి గత వారం ముఖ్యమంత్రి రూ. 7300ల కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారన్నారు. మెట్రో రైలు పరిధి పెంచుతున్నామని, కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతం కొనసాగుతుందన్నారు. ప్రజలు పచ్చదనంపై దృష్టి పెట్టాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో స్తానిక నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, చిత్రంలో తుమ్మల నాగేశ్వరరావు, కాలనీవాసులు



అఖిల భారత 'ఆర్కిటెక్చర్ రికనెక్ట్ సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి

# నగరీకరణ సమస్య కారాదు

**- అవకాశంగా మలుచుకోవాలి**
**-సామాజిక, ఆర్థిక కోణంలో సాంకేతిక పరిష్కారాలు అన్వేషించాలి**
**-ఆర్కిటెక్ట్‌ల సదస్సులో మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** శరవేగంగా పెరుగుతున్న నగరీకరణ ప్రక్రియను ఒక సమస్యగా కాకుండా దానిని దేశ అభివృద్ధికి ఒక అవకాశంగా చూడాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఆదివారం అఖిల భారత 'ఆర్కిటెక్చర్ రికనెక్ట్ సమ్మిట్‌లో అయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన దేశంలో అత్యధిక జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉందని, దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే దేశ స్థూల సంపద (జీడీపీ) పెరగాలని చెప్పారు. చైనా వలే పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఇచ్చి, వ్యవసాయ రంగం నుండి వీలైనంత మందిని పారిశ్రామిక రంగానికి మళ్లిస్తే నగరీకరణ ప్రక్రియలో భాగంగా మన దేశాభివృద్ధి మరింత శీఘ్రతరం అవుతుందని తెలిపారు. మెట్రో రైల్ గొప్ప ప్రజా రవాణా వ్యవస్థగా అత్యంత ఆదరణ పొందడానికి అనేక కొత్త ఆవిష్కరణలే కారణమని ఆయన అన్నారు. నగరాలలో ట్రాఫిక్ రద్దీ సమస్యకు మంచి ప్రజా రవాణా వ్యవస్థే సరైన పరిష్కారమని ఆయన చెప్పారు. నగరాలలో ఎక్కువగా ఉన్న పేదరికం, సరైన గృహ సదుపాయాలు లేకపోవడం, ఆహ్లాదకరమైన బహిరంగ ప్రదేశాలు లేకపోవడం వల్ల నేరాల సంఖ్య పెరుగుతోందని ఆయన అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన పార్కులు, బహిరంగ ప్రదేశాలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఇందుకు ఉదాహరణగా కొలంబియాలో ఉన్న బొగొటా నగరం గురించి ప్రస్తావిస్తూ, అద్భుతంగా సాధించిన ఆ నగరం అభివృద్ధి గాథను స్ఫూర్తివంతంగా తీసుకోవాలని ఆయన సూచించారు. వర్షపు నీటిని పొదుపు చేయడంలో సింగపూర్ చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ, భూగర్భ మిగతా 3లో



సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గన్న గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి,ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు

# 'తెలంగాణ విమోచనం'పై ఫోటో ఎగ్జిబిషన్

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఛాయ చిత్ర ప్రదర్శన విడియో మ్యూజియంలను ప్రారంభించారు. ఈ ఛాయ చిత్ర ప్రదర్శనలో దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత హైదరాబాద్‌ను వదలకుండా అప్పటి రజాకార్ల దౌర్జన్యాలు, అరాచకాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తిరుగు బాటు చేయడం వంటి విడియోలు, ఛాయ చిత్ర ప్రదర్శనలు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించడంతో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ సంతోషం వ్యక్తం చేశారు.

# నగరంలో మళ్లీ భారీ వర్షం

**కుండపోత వర్షం- నలుదిక్కులా ట్రాఫిక్ జామ్**
**కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు**
**అస్తవ్యస్తంగా మారిన జనజీవనం**



బంజారాహిల్స్ లో వరద పరిస్థితిని సమీక్షిస్తున్న మేయర్ విజయలక్ష్మి

**హైదరాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** మరోసారి నగరంలో భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ అతలాకుతల మైంది. జనజీవనం స్తంభించింది. ఆదివారం సాయంత్రం భారీ వర్షంతో నగరంలో రహదారులను జలమయం చేసింది. ట్రాఫిక్ నిలిచిపోయి, తక్కువ ఎత్తులోని ప్రాంతాలు నీటమునిగాయి. రాత్రి నివాసాలకు చేరే సమయాల్లో వర్షం కురవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ద్విచక్రవాహనదారులు, పాదచారులు వర్షం నుండి తప్పించుకోవడానికి ఫ్లైఓవర్లు, దుకాణాల షెడ్ల కింద తలదాచుకోవాల్సి వచ్చింది. ప్రధాన రోడ్లన్నీ నదులను తలపించాయి. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచి పోయింది. వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ,బొడుప్పల్, రామంతాపూర్, నాచారం, తార్నాక, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, రసూల్‌పురా, మధురానగర్, బోరబండ, యూసుఫ్‌గూడలో వర్షం పడింది. ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్, మెహదీపట్నం, లంగర్‌హౌస్, కార్వాన్, గోల్కొండ, ఖైరతాబాద్, లక్డీకపూరల్, మాదాపూర్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, వివేకానందనగర్, హిమాయత్‌నగర్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, కాప్రా, నేరేడ్‌మెట్, మల్కాజ్‌గిరి, అల్వాల్,జియాగూడ, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఫిలింనగర్, ఎల్‌బీనగర్, వనస్థలీపురం, నాగోల్, మల్కాజ్‌గిరి, జవహర్‌నగర్, కాప్రాలో భారీ వర్షం కురిసింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ నగరంలో దంచికొట్టిన వర్షంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. రాత్రి పొద్దుపోయే దాకా వాహనాలు ముందుకు కదలలేదు. ఖైరతాబాద్ నుంచి బేగంపేట్, మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి, గచ్చిబౌలి నుంచి కొండాపూర్, పంజాగుట్ట నుంచి గచ్చిబౌలి, కూకట్పల్లి నుంచి మియాపూర్, శేరిలిం గంపల్లి నుంచి హైటెక్ సిటీ, మాదాపూర్, హయ త్నగర్ నుంచి మలక్పేట, బషీర్ బాగ్ నుంచి కోఠి, ట్యాంక్బండ్ నుంచి ఎస్పీరోడ్, ఆర్పీరోడ్ వరకు భారీగా ట్రాఫిక్ నిలిచి పోయింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, టోలిచౌకి, ఫిలింనగర్ ఏరియాల్లో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మెహదీపట్నం రోడ్డులో కూడా భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి, తార్నాక-హబ్సిగూడ-నాచారం రోడ్డులోనూ ఇదే పరిస్థితి కనిపించింది. జూబ్లీహిల్స్ అపోలో రోడ్డులో ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనదారులు నానా తిప్పలు పడ్డారు. ఒకపక్క వర్షం..మరో పక్క ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



సిసి ఫుటేజిలో రికార్డు అయిన దాడి దృశ్యాలు

# హాస్టల్‌పై అర్ధరాత్రి దాడి

**పలువురికి గాయాలు**
**అమ్మాయిని వేధిస్తున్నాడని వారించినందుకు**
**అన్నవరం అండ్ గ్యాంగ్ హల్‌చల్**

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** మద్యం మత్తులో అమ్మాయిని వేధిస్తున్నాడని వారించినందుకు యువకులు గ్యాంగుగా ఏర్పడి హాస్టల్‌లోకి దూరి తీవ్రంగా దాడి చేసి గాయపరిచిన సంఘటన కేపిహెచ్బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి కెపిహెచ్‌బి కాలనీలో నివాసముండే దుర్గాప్రసాద్ అలియాస్ అన్నవరం అతని అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్డు నంబర్ 3లోని శ్రీ సూర్య బాయ్స్ హాస్టల్‌పై అర్ధరాత్రి జరిగిన ఈ దాడి స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం, కెపిహెచ్‌బి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అలియాస్ అన్నవరం తన గ్యాంగ్‌తో కలిసి కెపిహెచ్‌బి కాలనీలో ఉండే హాస్టల్ వద్ద మద్యం సేవిస్తున్నాడు. మద్యం మత్తులో హాస్టల్ మిగతా 3లో

# పేద విద్యార్థుల చేయూతకు రూ.20 లక్షల వితరణ

### గాంధీ మెడికల్ కాలేజ్ పూర్వవిద్యార్థుల ఆదర్శం

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** గాంధీ మెడికల్ కాలేజ్ 71వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కళాశాల ఆలుమ్ని అసోసియేషన్ హాలులో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆలుమ్మి అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ డి.రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ పీవీ.నంద కుమార్ రెడ్డి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కె.మహేష్, జీఎస్టీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ దొంతి గాంధీ, కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే ఇందిరా, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణిలు అతిథులుగా హాజరయ్యారు. గాంధీ ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.ఆర్ లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య విద్యా అధ్యాపకులుగా పని చేసిన రిటైర్డ్ ప్రొఫెసర్‌లు డాక్టర్ సుధా రమణి, డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ అశోక్ కుమార్‌లను సన్మానించారు. గాంధీ మెడికల్ కాలేజ్ వివిధ విభాగాలలో యూజీ, పీజీ, సూపర్ స్పెషాలిటీలలో ప్రతిభ కనబరచి మెరిట్ సాధించిన 64 మంది వైద్య విద్యార్థులకు బంగారు పతకాలను అందించి, ప్రశంసా పత్రాలను అందించారు. పేద వైద్య విద్యార్థులకు స్కాలర్ షిప్ లను ఇవ్వడానికి కొందరు పూర్వ విద్యార్థులు తమ వంతుగా 20 లక్షల రూపాయల విరాళాలను సభా వేదికపై అలుమ్ని అసోసియేషన్ అందించారు. గాంధీ సూపర్ అంటే డాక్టర్ ఎన్ వాణి మాట్లాడుతూ ఆస్పత్రిలో కొన్ని విభాగాల్లో వైద్య పరికరాలు అవసరం ఉన్నాయని చెప్పగానే అక్కడే ఉన్న పూర్వ విద్యార్థులు వాటిని తాము సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.



వైద్య విద్యా అధ్యాపకులుగా పనిచేసిన రిటైర్డ్ ప్రొఫెసర్‌లు డాక్టర్ సుధా రమణి, డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ అశోక్ కుమార్‌లను సన్మానిస్తున్న దృశ్యం



కాకగూడలో అన్నదానం చేస్తున్న రమేశ్ తదితరులు

## అన్నదానం గొప్పది

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని శ్రీ సుబ్రమణ్యా స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చొల్లేటి రమేశ్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ 5వ వార్డులోని హన్‌మాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చొల్లేటి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యా స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మ, వేద పండితులు హేమంత్ శర్మ, ట్రస్ట్ బోర్డు మెంబర్ నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.



యువకులతో మాట్లాడుతున్న ఏసిపి కృష్ణయ్య, ఇన్స్పెక్టర్ మక్బుల్‌జానీ

## శాంతి భద్రతలలో భాగస్వాములు కావాలి

### ఎల్బీనగర్ జోన్ ఎసిపి కృష్ణయ్యగౌడ్

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** శాంతి భద్రతల విషయంలో యువకులు భాగస్వాములు కావాలని అప్పుడే సమాజంలో నేరాలను అరికట్టవచ్చని ఎల్బీనగర్ జోన్ ఎసిపి కృష్ణయ్యగౌడ్ పేర్కొన్నారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాచకొండ కమీషనర్ ఆదేశాల మేరకు ఎల్‌బినగర్ ఏసిపి కృష్ణయ్య గౌడ్ ఆధ్వర్యంలో బండ్లగూడ ఎక్స్ రోడ్‌లో నాగోల్ పోలీసులు విసబుల్ పోలీసింగ్‌ను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నియమ నిబంధనలు, సైబర్ క్రైమ్, సీసీటీవీల వల్ల కలిగే ఉపయోగాలు, డ్రగ్స్, మహిళలు, వృద్ధులు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలు, నేరాలు, సమాజం పట్ల పౌరుల భాధ్యతల గురించి ఏసీపీ కృష్ణయ్య వివరించారు. ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీస్ అని, సమా జంలో నేరల నియంత్రణ పట్ల భాధ్యతగా వ్యవహరించాలని యువతకు సూచించారు. ఇటీవల గణేష్ నిమజ్జనం కార్యక్రమం ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాఫీగా జరగడానికి సహకరించిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మక్బుల్‌జానీ, ఎస్సైలు రమేష్, ధశరథ, శివనాగ ప్రసాద్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## కుమారుడిపై తండ్రి కత్తితో దాడి

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** కుమారుడిపై కన్నతండ్రి కత్తితో దాడి చేసిన సంఘటన ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగరన పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్ దీన్‌దయాల్‌నగర్‌లో నివసిస్తున్న నరసింహ తన భార్యపై దాడి చేశాడు. గచ్చిబౌలిలో ఇంటర్వ్యూకు వెళ్లిన వారి కుమారుడు అల్లం సురేష్(19) తన బంధువుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకొని వెంటనే ఇంటికి వచ్చాడు. అప్పటికే గాయాలతో తల్లి ఏడుస్తుండటాన్ని గమనించిన అతను ఇంట్లో తలుపు పెట్టుకొని ఉన్న తండ్రిని బయటకు రావాలంటూ సూచించాడు. కోపంతో ఊగిపోతున్న నరసింహ తన వెనుక దాచుకున్న కూర గాయల కత్తితో కుమారుడిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో సురేష్ గొంతుపై కత్తి గాయం కావడంతో రక్తస్రావమైంది. స్థానికులు వెంటనే సురేష్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. సురేష్ ఫిర్యాదు మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మధుర గాయకుడు బాలకామేశ్వరరావుకు సత్కారం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** అశోక్ నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 62వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, హైదరాబాద్ ఐ హాస్పిటల్ వైద్యులు శ్రీ డాక్టర్.వెంకటాచలం, ఎస్‌బిఐ అశోక్ నగర్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సంతాజీ కందుగుల పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సంగీత విభావరిలో అలనాటి మధుర గానాలతో అతిథులను అలరించారు. అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు. అశోక్ నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సూర్యప్రకాష్, ఉపాధ్యక్షులు వై ఆర్ రెడ్డి,కార్యదర్శి పండిట్ డాక్టర్ అంజి బాబు, జాయింట్ సెక్రటరీ గోళ్ళమూడి పద్మావతి, కోశాధికారి శివన్నా యుడు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## 18న సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** ప్రముఖ రాజకీయవేత్త, ఆధ్యాత్మికవేత్త, కళా బంధ డా. తిక్కవరపు సుబ్బరామిరెడ్డి (టిఎస్ఆర్) జన్మదిన వేడుకలు కన్నులపండువగా నిర్వహించనున్నారు. ఈమేరకు 18 గురువారం సాయంత్రం 5గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో టిఎస్ఆర్ ఆధ్యాత్మిక కళాపరిషత్ కార్యనిర్వహణ కార్యదర్శి డా. ఎం.కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతరంగ ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి వాసురావు, సాహిత్యరంగం నుండి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రంగస్థలం నుండి గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కిమ్స్ వద్ద వృద్ధుడు అదృశ్యం

**బేగంపేట సెప్టెంబరు 14,ప్రభాతవార్త :** వెద్య పరిక్షల కోసం మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆస్పత్రికి వచ్చిన మియాపూర్‌కు చెందిన త్రిభువన్ నాథ్ (65)అదృశ్యమైన సంఘటన రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనపై రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. త్రిభువన్ నాథ్ 15సంవత్సరాల నుంచి సిరోసిస్ మరియూ దయాబెటిస్ చెకప్ పూర్తియిన తర్వాత మధ్యాహ్నం గం 2లకు ఆసుపత్రి ప్రధాన గేటు నుంచి బయటకు వచ్చాడని ఆ తరువాత ఆయన ఇంటికి రాలేదన్నారు. డ్రైవర్ ఎన్ని సార్లు ఆయనకు కాల్ చేసినా ఫోన్ తీయలేదన్నారు. ఆ తర్వాత గం 8ల సమయంలో అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చిందన్నారు. ఆ తరువాత ఆయన ఆచూకి తెలియలేదని, తన తండ్రి ఆచూకి తెల్సుకోవాలంటూ త్రిభువన్ నాథ్ కుమారుడు సత్యప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేసాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ నర్సింగరావు తెలియజేసారు.

## ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం

### ఇద్దరి అరెస్ట్

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** :ఎక్సైజ్ విభాగం ఎస్టీఎఫ్-ఎ బృందం బంజారాహిల్స్‌లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఎండీఎంఏ, గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎస్టీ ఎఫ్ బృందానికి అందిన విశ్వసనీయ సమా చారం మేరకు బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో దాడి చేయగా మధురానగర్ ప్రాంతానికి చెందిన భరత్ తుక్రాల్(50), ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం ప్రాంతానికి చెందిన కొరిపల్లి కృష్ణ(43)లు అనుమానస్పద స్థితిలో పట్టుబడ్డారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద వివిధ రంగుల్లో ఉన్న 14.83 గ్రాముల ఎండీఎంఏ, 70 గ్రాముల గంజాయి పట్టుకోవడమేకాకుండా వారు వినియోగిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. కాగా వీరికి సరఫరా చేస్తున్న ఢిల్లీకి చెందిన మొహమ్మద్ షాజెబ్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ విభాగం అధికారులు తెలిపారు. భరత్ పాత నేరస్థుడని, 2020లోనూ ఎండీఎంఏ, కొకైన్, హష్ ఆయిల్ సహా భారీగా డ్రగ్స్‌తో పట్టుబడ్డట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్, అంబర్‌పేట పోలీస్‌స్టేషన్లలో అతనిపై కేసులు నమోదై ఉన్నాయన్నారు. గ్రైండర్ యాప్ ద్వారా పరిచయమైన గేలకు, విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తూ అనేక మందిని స్వలింగ సంపర్క కార్యకలాపాల్లోకి దించినట్లు గుర్తించామన్నారు. పట్టుబడిన వీరిని అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి

## ఆర్‌టిసి విలీన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు సంబంధించిన 9 సంఘాలకు గుర్తింపును పునరుద్ధరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యపట్ల ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీలోని కార్మిక సమస్యల పరిష్కారం, యూనియన్ల పునరుద్ధరణ గురించి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదు అంశంపై యూనియన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, రాష్ట్ర ముఖ్య సలహాదారు బోయపల్లి యాదయ్య, జిపిఆర్ రెడ్డి, ఎంహెచ్.అలీ, సుశీల్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ల్యాబ్‌ట్యాబ్‌ను బహుకరిస్తున్న లోకిని రాజు, శ్రీరాం సదానందం తదితరులు

## హామీలను అమలు చేయాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎరుకల సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం, ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ సంఘాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ రాజ్యాంగం ఏర్పడిన నాటి నుంచి ఆదివాసీ ఎరుకల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్‌లు పది శాతం అమలు చేయాలని, తమ జాతీ అభివృద్ధికి ఏకలవ్య కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వం చేపట్టిన ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి 5.5 కోట్లు బడ్జెట్ కేటాయించి పూర్తి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ ఎరుకల జాతిని గుర్తించి రాజకీయాల్లో అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం సోని అనే విద్యార్థికి ల్యాబ్‌ట్యాబ్ బహుకరించగా, మరొక విద్యార్థి సౌమ్యకు 30 వేల రూపాయల ఆర్థిక సహం అందించింది. ఈ సమావేశంలో ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరాం సదానందం, ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్, నాయకులు కోనేటి నర్సింహా వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్‌పాషా

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం: అజీజ్‌పాషా

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై భూపతి సురేష్ నిరంతరం పోరాటం చేసేవారని మాజీ రాజ్యసభ సభ్యుడు, సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ జయపురి కాలనీలో సిపిఐ నాయకుడు బొడ్డుపల్లి కృష్ణ అధ్యక్షతన భూపతి సురేష్ సంతాపసభ ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో పటిష్టమైన కార్యకర్తగా నిరంతరం అనేక సమస్యలపై పనిచేసేవారని గుర్తు చేశారు. సమస్యలపై ఆయన చేసిన సేవలు చిరస్మరణ నియమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య, శ్యామల యాదగిరి, తూర్పాటి చిరంజీవి, రవీంద్రచారి, శేఖర్‌రెడ్డి, రామనారాయణ, ఎండి. బషీర్, సూరారం రాములు, గంగాధర్, పగిళ్ల శంకర్, సంపత్, బొడ్డుపల్లి చుక్కయ్య, రాజు మల్లయ్య, శ్యామల, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

## త్వరలో ప్రహరీ గోడ తొలగిస్తాం

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** కాలనీ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు త్వరలోనే ప్రహరీగోడ తొలగిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. నాగోల్ డివిజన్ శ్రీవిజయదుర్గ ఎన్‌క్లేవ్ గేటెడ్ కమ్యూనిటీ వారు ప్రహరీగోడ నిర్మించడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని 10 కాలనీలకు చెందిన ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి ప్రహరీ గోడను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో ట్రంక్ లైన్ నిర్మాణం పనులు త్వరలో జరగనున్నాయని అందులో భాగంగా ఆ ప్రహరీ గోడను కూడా తాము తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి, తూర్పాటి చిరంజీవి, కాటేపాక రవి, కాలనీవాసులు అరవింద్‌రెడ్డి, అంకరాజు, వెంకట్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

## నందకుమార్ యాదవ్‌కు దత్తాత్రేయ పరామర్శ

**గచ్చిబౌలి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త;** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమాకుమార్ యాదవ్ సతీమణి అనురాధ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసుకున్న కేంద్ర మాజీ మంత్రి, హిమాచల్ ప్రదేశ్, హర్యానా రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం శేరిలింగంపల్లి గ్రామం రేయిన్ ట్రీ అబాడ్‌లోని నందకుమార్ యాదవ్ ఇంటికి వచ్చి వారిని పరామర్శించారు. అనురాధ త్వరగా కోలువాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతకింది గోవర్ధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి, నాయకులు రాఘవేందర్ రావు, శాంతిభూషణ్ రెడ్డి, విజయలక్ష్మి మ్మ, రమణీయమ్మ, రాధమూర్తి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య..

**జీడిమెట్ల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన లూనా మేది (45) గత 12 సంవత్సరాల కింద బ్రతుకు దెవురు కోసం ఒడిస్సా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు వచ్చి, సూరారం పరిధిలోని హాట్‌సన్ మిల్క్ కంపెనీలో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనిపో పాటు మరో 20మంది వర్క్ చేస్తున్నారు. కంపెనీ ఇతనికి ఆ 20 మంది జీవితాలు కూడా ఇతనికి ఇవ్వడం జరుగుతుంది. ఇతను తిరిగి ఆ డబ్బులు లేబర్‌కి ఇవ్వడం జరుగుతుంది. కానీ తన ఆర్థిక ఇబ్బందుల వలన గత మూడు నెలల నుండి కంపెనీ ఇచ్చినటువంటి డబ్బులను తన సొంత అవసరాలకు వాడుకోవడం వలన తన కింద ఉన్న లేబర్‌కి సరైన సమయంలో వారికి జీతాలు ఇవ్వలేకపోయాడు. కానీ అతను ఆర్థిక ఇబ్బందుల వలన వారి దగ్గర వాడుకున్నటువంటి డబ్బులు తిరిగి ఇవ్వడం కుదరక మనస్థాపానికి గురై కంపెనీకి చెందినటువంటి లేబర్ అడ్డాలో ఉంటున్న రూములో శనివారం ఉదయం 06:30 గం.లకు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## దేశాభివృద్ధికి కార్మికులే పట్టుకొమ్మలు

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**జీడిమెట్ల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఎంటీఏఆర్ ఎంప్లాయిస్ యూని యన్‌కు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం 125 గాజులరామారం డివిజన్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన ఎంటీఏఆర్ ఎంప్లాయిస్ గెట్ టు గెదర్ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కార్మికులే పట్టుకొమ్మలని, కార్మిక సంక్షేమానికి, అభివృద్ధికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని యూనియన్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వి.శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. నారాయణ, ప్రధాన కార్యదర్శి మాయ రాజయ్య, లీగల్ అడ్వైజర్ పందెం దామోదర రెడ్డి, సలహాదారులు బుచ్చిరెడ్డి, ఎల్లారెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, సమ్మయ్య, వెంకటేశ్వర రెడ్డి, టి.రాముడు, సంయుక్త కార్య దర్శిలు శ్రీనివాసరావు, సిద్ధిరాములు, తిరుపతి నాయుడు, మణికుమార్, శ్రీధర్, కార్య నిర్వాహక కార్యదర్శి మధుసూదన్ రావు, అనంతరావు, కీర్తి శ్రీనివాస్, స్టైలబ్, నరసింహారెడ్డి, కోశాధికారి రవీందర్ రెడ్డి, ఇతర నా యకు, యూనియన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, చిన్నా చౌదరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎంటీఏఆర్ ఎంప్లాయిస్ గెట్ టు గెదర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

## నిరుపేదలకు ఉచితంగా మంచి వైద్యం పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, సెప్టెంబరు 14 ప్రభాత వార్త :** నిరుపేదలకు ఉచితంగా మంచి వైద్యాన్ని అందించేందుకు తాము నిరంతరం శ్రమిస్తున్నామని సికిం ద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూ టీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. బౌద్ధానగర్ ఎస్.ఆర్.వీ. మల్టీ స్పెషాలిటి క్లినిక్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ శిబిరాన్ని పద్మారావు గౌడ్ ప్రారంభించి, ఉచితంగా మందులను రోగులకు అందించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ వైద్య సేవలను అందించే వ్యక్తులు, సంస్థలను ప్రోత్స హిస్తామని తెలిపారు. ఎస్.ఆర్.వీ. మల్టీ స్పెషాలిటి క్లినిక్ తో పాటు విబ్సున్ ఫార్మా, సుంకు ట్రస్ట్ వంటి వివిధ సంస్థల ద్వారా వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్ తెలిపారు. ఖరీదైన వైద్య పరేక్షలతో పాటు రోగులకు ఖరీదైన మందులు కూడా పూర్తిగా ఉచితంగా ఈ శిబిరంలో అందించేలా ఏర్పాట్లు జరిపామని తెలిపారు. కార్పొరేటర్ కంది శైలజ, నాయకులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

## ఆదివాసీ హక్కుల సాధన కోసం ఉద్యమ బాట

- 28న భద్రాచలంలో భారీ బహిరంగ సభ
- డిసెంబర్ 9న హైదరాబాద్‌లో
- అనంతరం ఢిల్లీలోనూ సభలు
- మాజీ ఎంపీ సోయం వెల్లడి

**తార్నాక, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** ఆదివాసీల హక్కుల సాధన కోసం ఈనెల 28న ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ ఎంపి సోయం బాపూరావు తెలిపారు. ఆదివాసి 9 తెగల రాష్ట్రస్థాయి మేధో మథనం కార్యక్రమాన్ని ఆదివాసీ 9 తెగల ఐక్య కార్యచరణ కమిటి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్‌లో ఆదివారం నిర్వహించారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సోయం బాపూరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ హైదరాబాద్‌లో డిసెంబర్ 9న, తరువాత ఢిల్లీలో సైతం భారీ ఎత్తున బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ సభలకు ప్రతి ఒక్క ఆదివాసి బిడ్డ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా 9 ఆదివాసీ తెగలకు చెందిన మేధావులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజా సంఘాలైన తుడుం దెబ్బ, సంక్షేమ పరిషత్ ఆదివాసీ సేన, విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఏఎస్‌యూ, మహిళా చైతన్య శక్తి, ఆదార్ సొసైటీ నాయకులతోల పాటు పలువురు పాల్గొన్నారు. జాతి ప్రయోజనాలు, అస్థిత్వం, రానున్న రోజుల్లో నిర్వహించబోయే ఉద్యమ కార్యచరణ, రాష్ట్ర స్థాయి ఐక్య కార్యచరణ సమితి ఏర్పాటు పై చర్చించారు. ఈ సందర్భంగా ఆదివాసీ 9 తెగల సమన్వయకర్త చంచు రామకృష్ణ మాట్లాడుతూ చట్టబద్ధతలేని అంశాన్ని భారత రాజ్యాంగం ఆర్టికల్ 342(2) ప్రకారం లంబాడి, బంజారా, సుగాలీలను ఎస్టీ జాబితాల్లో కలపలేదన్నారు. అందుకు సంభందించి పూర్తి ఆధారాలు గెజిట్ నోటిఫికేషన్లు ఆనాడు వేసిన కమిషన్ల నివేదికల గురించి వివరించారు. అనంతరం ఆదార్ సొసైటీ రాష్ట్ర నాయకులు గొంది వెంకటరమణ, మెట్ల పాపయ్య, సీతారాములు, భాస్కరరావు, తెల్లం వెంకటేశ్వర్లు, గెడాల జనార్ధన్, పోడియం, బాలరాజు, మడకం శ్రీనివాస్, తుడుం దెబ్బ నాయకులు మైపటి అరుణ్‌కుమార్, కొటెం వెంకటేశ్వర్లు ముక్త రాజు, కల్తి సత్య నారాయణ, రామస్వామి, జారె కృష్ణ, ఆదివాసీ సేన నాయకులు కోషా దైలత్ రావు భట్లు వెంకటేశ్వర్లు సుమ్మడి సుధీర్, ఆజయ్, పాపారావుతో పాటు, వెంకటేశ్వర్లుతో పాటు వివిద జిల్లాల నుంచి వచ్చిన ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపి సోయం బాపూరావు

## ఆధునిక శస్త్ర చికిత్స విధానాలపై సదస్సు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** శస్త్రచికిత్సలో ఖచ్చితత్వం, ఆధునికతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అపోలో ఆసుపత్రి సీనియర్ ఆర్థో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపి సమ్మిట్ కార్యనిర్వాహక ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసి యేషన్, అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో 9వ ఆర్థోప్లాస్టీ, ఆర్థోస్కోపి సమ్మిట్-2025 సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు సరైన శస్త్రచికిత్స నైపుణ్యాలు మెరుగుపర్చడంలో భాగంగా నాలెడ్జ్, ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంచేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మోకాలు, హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్స అవసరం లేకుండానే జాయింట్ సమస్యలకు చికిత్స చేయడానికి వినూత్న విధానాలపై దృష్టి సారించమన్నారు. నూతన సాంకేతికలపై నిపుణుల ఆధ్వర్యంలో చర్చలు జరిగాయన్నారు. శస్త్రచికిత్స అవసరం లేని రోగులకు ఉపశమనం కలిగించే మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో భాగంగా 42 రిలీవ్ ఆర్థోపెడిక్ ప్రక్రియలను ఇక్కడ చూపించారు. దాదాపు 200ల మందికిపైగా వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి ఇతర వైద్యులు



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆదివారం బన్సీలాల్ పేట డివిజన్‌లోని మేకల మండిలో గల ప్రభుత్వ పాఠశాలలో బద్రి విశాల్ పన్నాలాల్ పిట్టి, అగర్వాల్ సేవాదల్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం ఎంతో ఖరీదైనదిగా మారిందని అన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలలో వివిధ రకాల విభాగాలలో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు తగు సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ఎంతో ఖరీదైన వైద్య పరీక్షలు కూడా ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరులు పాల్గొన్నారు.



వంశీరాజు దంపతులను సత్కరిస్తున్న పుష్పగిరి పీఠం విద్యాశంకర భారతీస్వామి

## రామరాజు చిరకాలం సాంస్కృతిక సేవ చేయాలి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** ఎవరి వయస్సు నైనా వారు వృత్తిని తపస్సుగా భావించి చేస్తున్న కాలం మాత్రమే అని పుష్పగిరి పీఠం విద్యా శంకర భారతీ స్వామి చెప్పారు. వంశీ రామరాజు సాహిత్య కళా పోషణను తపస్సుగా చేస్తున్న ఏభై మూడేళ్ల కాలమే ఆయన వయస్సు అని, ఇలా మరో ఏభై ఏళ్ల పాటు సాంస్కృతిక సేవ చేయాలని స్వామి ఆశీస్సులు అందించారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు 75వ జన్మ దినోత్సవం ఘనంగా జరిగింది .. ముఖ్య అతిథిగా విద్యా శంకర భారతీ స్వామి పాల్గొని విదేశాలలో తెలుగు సంస్కృతి భాష వ్యాప్తికి కృషి చేస్తున్న వంగూరి చిట్టెన్ రాజ్ (అమెరికా) వామ రాజు సత్య మూర్తి(సింగపూర్) బూరుగు పల్లి వ్యాస కృష్ణ (ఉగాండా) లను సత్కరించి మాట్లాడారు. వేదికపై బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. స్వామి వంశీ రామరాజు దంపతుల్ని సత్కరించిన అనంతరం పలు సాంస్కృతిక సంస్థలు ప్రతినిధులు అభిమానుల గాయనీ గాయకులు. సత్కరించారు.

## రాజీవ్ గృహకల్పకు మంజీరా నీటి వసతి

**అల్వాల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** కౌకూర్ రాజీవ్ గృహకల్ప వాసులకు అతి త్వరలోనే మంచి నీటి సమస్య తీరనున్నదని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. ఆదివారం గృహకల్ప సముదాయం వద్ద 13లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న మంచి నీటి సరఫరా పైపు లైను నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. దశాబ్దాలు కాలంగా అపరిష్కృతంగా మంచి నీటి సమస్య మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చొరవతో తీరనున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సురేందర్ రెడ్డి, మల్లిఖార్జున్, శ్రీశైలం యాదవ్, రాజేందర్ రెడ్డి, సర్వేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా పక్వాడ్ సన్నహక సమావేశం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** అడిక్‌మెట్ డివిజన్ భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా పక్వాడ్ సన్నహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా బిజెపి కార్యదర్శి బొల్లంపల్లి రాంరెడ్డి హాజరై ప్రసంగించారు. సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు బిజెపి పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ నేతలు, కార్యకర్తలు, బూత్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.




## గురువులను సత్కరించుకోవడం సంప్రదాయం

-గురువులను సత్కరిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, చిత్రంలో ఎమ్మెల్యే సామ్యుల్, ఎమ్మెల్సీ దయానంద్, నిర్వాహకుడు కాపర్తి ప్రకాశ్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** గురువులను సత్కరించుకోవడం మంచి సంప్రదాయమని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో శిల్పా ఆర్ట్ క్రియేషన్స్, శిల్పా కల్చరల్ వెల్ఫేర్ ట్రస్ట్, కాపర్తి క్యాన్సర్ ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా 'జాతీయ శిల్పా ఐకాన్ అవార్డు'ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కాపర్తి ప్రకాశ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 69 మంది ఉపాధ్యాయులను సత్కరించే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథులుగా తుంగతుర్తి ఎమ్మెల్యే ఎం.సామ్యూల్, శాసనమండలి సభ్యుడు బొగ్గారపు దయానంద్, యోగా గురు అల్లాడి పరమేశ్, నిర్వాహక సంస్థ ప్రధాన కార్యదర్శి బి.గంగాధర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.పద్మప్రియ, కె.రాములు, కె.కృష్ణ, పారిజాత, సౌమ్యాశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 17న జాతీయ జెండాను ఎగరవేయాలి : కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** తెలంగాణ,హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీన వాడ వాడల్లో, ప్రతి పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగరవేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు మజ్లీస్ పార్టీలకు బయపడి తెలంగాణ విమోచన దినోత్సవేడుకలు జరపడం లేదన్నారు.

